తేమశాతం ఉన్నప్పుడే ధాన్యాన్ని మిల్లులకు పంపాలి

చిన్నగొట్టిముక్ల ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

శివ్వంపేట, మే 28: సరైన తేమశాతం ఉన్నప్పుడే ధాన్యాన్ని మిల్లులకు పంపాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలపరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు పలు సూచనలు చేస్తూ కొనుగోళ్లు వేగవంతం చేయాలని, తేమశాతం కరెక్ట్‌గా ఉన్నప్పుడు మాత్రమే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. రవాణా సంబంధిత విషయాల్లో లారీల కొరతలేదని, ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురావాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాల సమస్యలను వాట్సాప్ ద్వారా తెలుసుకొని చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు అహర్నిశలు కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతుధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రం అధికారులు, మండల అగ్రికల్చర్ అధికారులు, మిల్లర్లు సమన్వయంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, పీఏసీఎస్ సీఈవో మధు, ఐకేపీ సీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొంటాం

చిలిపిచెడ్, మే 28: రైతులకు ఇబ్బందులు లేకుండా సక్రమంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. మండలంలోని సోమక్కపేటలో పీఏసీఎస్ ద్వారా చిట్కుల్, గౌతాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా, కేంద్రాల్లో ఉన్న ధాన్యం బస్తాలను లారీల్లో మిల్లులకు తరలిస్తామన్నారు. రైతులెవ్వరూ కూడా ధాన్యం తరలింపు కోసం లారీ డ్రైవర్లకు డబ్బులు ఇవ్వొద్దన్నారు. మండలంలో ఈ నెలాఖరు వరకు కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది దత్తు, రైతులు ఉన్నారు.

తరుగు పేరుతో రైతులను మోసం చేయొద్దు

కొనాపూర్‌లో తడిసిపోయి మొలకొచ్చిన వడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం: ఇండ్లు కూలిపోయిన బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

■ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం, మే 28: తరుగు పేరుతో రైతులను మోసం చేయొద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని కొనాపూర్ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి సందర్శించి మాట్లాడారు. రెండు నెలలుగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని తూకం వేయకపోవడంతో వడ్లు అకాల వర్షానికి మొలకెత్తి పాడైపోతున్నాయన్నారు. పైతర కొనుగోలు కేంద్రం లో ప్రమాద వశాత్తు ఆరబెట్టిన ధాన్యం కాలిపోవడంతో వడ్లను పరిశీలించారు. కొనుగోలు కేంద్రం నుంచి రెండు లారీల ధాన్యం పంపగా 30బస్తాల చొప్పున రెండు లారీల నుంచి తరుగు పేరుగో 60 బస్తాలు కట్ చేశారని రైతు లు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆమె స్పందిస్తూ జిల్లా పౌర సరఫరాల అధికారికి ఫోన్ చేసి రైతుల వద్ద తరుగు పేరుతో కోత విధించొద్దని, ప్రభుత్వం నిర్ణయించినట్లే తూకం వేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు న్యాయం చేయాలని సూ చించారు. కోనాపూర్, తుక్కాపూర్ గ్రామాల్లో ధాన్యాన్ని వెంటనే తరలించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం ఓ పక్క తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్నప్పటికీ తరుగుపేరుతో మరో పక్క రైతుల ధాన్యంలో కోత విధిస్తుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపా రు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి బ్రహ్మారావు, జడ్పీటీసీ మేఘమాల సంతోష్‌కుమార్, ఎంపీపీ మంజూలా కాశీనాథ్, యూత్ అధ్యక్షుడు సంతోష్‌రావు, నాయకులు నరేందర్‌రెడ్డి, చిట్యాల యాదయ్య, మల్లేశం, ఆంజనేయులు, రవితేజరెడ్డి రైతులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

మండలంలోని రంగంపేట, తుక్కాపూర్, పైతర గ్రామాల్లో ఇటీవల గాలివాన బీభత్సానికి రేకుల ఇండ్లు పూర్తిగా దెబ్బతిన్న కుటుంబాలను మంగళవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు. నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించాలని తహసీల్దార్‌కు సూచించారు. టీఆర్ ఎస్ యూత్ ఐకాన్ నాయకుడు రవితేజరెడ్డి బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేఘమాల సంతోష్‌కుమార్, ఎంపీపీ మంజూలా కాశీనాథ్, పైతర రవితేజరెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లేశం, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సంతోష్‌రావు, దొడ్ల ఆంజనేయులు, ఆరె రవీందర్, సోమ నర్సింహులు, నరేందర్‌రెడ్డి, గౌరీశంకర్, చిట్యాల యాదయ్య, సొసైటీ చైర్మన్ అరిగె రమేశ్ తదితరులు ఉన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

మండలంలోని సంగాయిపేటలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడువందల ఏండ్ల చరిత్ర కలిగిన పురాతన ఆలయాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేఘమాల సంతోష్‌కుమార్, ఎంపీపీ మంజూలాకాశీనాథ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు సంతోష్‌రావు, రవితేజారెడ్డి, చిట్యాల యాదయ్య, సోమా నర్సింహులు, ఆంజనేయులు, ఆరె రవీందర్, సిద్దిరాములు, విష్ణువర్ధన్ రెడ్డి, మోత్కు మల్లేశం, ఎల్లేశం పాల్గొన్నారు.

గంగమ్మ ఉత్సవాలకు ఆహ్వానం

వెల్దుర్తి, మే 28. వెల్దుర్తిలోని గంగాభవానీ ఆల య 36వ వార్షికోత్సవానికి రావాలని కోరుతూ గంగపుత్ర సంఘం నాయకులు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. మంగళవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సంఘం అధ్యక్షుడు బాలరాజు, నాయకులు పరమేశ్, నగేశ్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

సంగాయిపేటలో వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

మెదక్ రూరల్, మే 28: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచిందని మెదక్ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వానకాలం సాగు చేసుకోవాడానికి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు మెదక్ పట్టణంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరం ఉన్న రైతులు పట్టా పాస్‌పుస్తకాలు తీసుకొచ్చి తీసుకెళ్లాలని ఆయన తెలిపారు.

రైతులు విధిగా రసీదు పొందాలి

నిజాంపేట, మే 28: వానకాలం సీజన్‌కు సంబంధించి విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు విధిగా దుకాణ డీలర్ల నుంచి రసీదు పొందాలని రామాయంపేట ఏడీఏ వసంతసుగుణ అన్నారు. మంగళవారం నందిగామ, నిజాంపేటలో రైతులకు విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. లైసెన్స్ పొందిన దుకాణ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం నిజాంపేటలోని పలు విత్తన దుకాణాలను సందర్శించి స్టాక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో కావేరి, రైతులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

కౌడిపల్లి, మే 28: ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పెంచుతున్న నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని డీఎల్‌పీవో యాదయ్య సూచించారు. మంగళవారం కౌడిపల్లి మండల పరిధిలోని ధర్మాసాగర్, మహమ్మద్‌నగర్ గ్రామాల నర్సరీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే వానకాలం హరితహారానికి సరిపడా నాటేందుకు మొక్కలు సిద్ధం చేసుకోవాలన్నారు. పల్లె ప్రకృతివనంలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. అనంతరం శ్మశానవాటిక, డంపింగ్‌యార్డుల్లో తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారా అని కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీల రికార్డులను పరిశీలించారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెద్దశంకరంపేట, మే 28: ఖాతాదారులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ జనరల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆనంద్‌కుమార్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట ఎస్‌బీఐ శాఖలో ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఖాతాదారులు తమ వివరాలను గోప్యత పాటిస్తూ జాగ్రత్త పడాలని సూచించారు. ఫోన్‌లో ఎవరూ ఎలాంటి వివరాలు అడిగినా చెప్పకూడదన్నారు. ఖాతాలో ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా బ్యాంకులో వచ్చి చూసుకోవాలన్నారు. సైబర్ మోసాలు ఎదురైనప్పుడు వెంటనే 1930 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ కృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్‌కుమార్, తదితరులున్నారు.

ఎస్‌వోకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో యాదగిరి

నోట్ పుస్తకాలు అందజేత

వెల్దుర్తి, మే 28. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలను అందజేస్తుందని ఎంఈవో యాదగిరి తెలిపారు. మంగళవారం వెల్దుర్తిలోని కస్తూర్బా పాఠశాలకు వచ్చిన నోట్‌పుస్తకాలను పాఠశాల ఎస్‌వో ఫాతిమాకు అందజేశారు. అనంతరం ఎంఈవో యాదగిరి మాట్లాడుతూ వెల్దుర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న 1917 మంది విద్యార్థులకు 18,663 నోట్ పుస్తకాలు వచ్చాయని, జూన్ 12న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తామని చెప్పారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

వెల్దుర్తిలోని ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి ధ్యూన్సీ

వెల్దుర్తి, మే 28: ఎరువుల దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పకుండా రసీదులు పొందాలని మండల వ్యవసాయాధికారి ధ్యూన్సీ సూచించారు. మంగళవారం వెల్దుర్తిలో ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న రికార్డులు, స్టాక్ రిజిష్టర్లను, విక్రయించడానికి సిద్ధంగా ఉన్న ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని, వాటిపై దుకాణాల్లో ఉన్న స్టాక్ వివరాలు, రకాలు, వాటి ధరలను రోజూ రాయాలని దుకాణాదారులకు సూచించారు. ప్రైవేటు కంపెనీల విత్తనాల విక్రయాలపై జాగ్రత్త వహించాలని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. నాసిరకం, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

అల్లాదుర్గం, మే 28: ఫర్టిలైజర్ షాపుల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. అల్లాదుర్గంలోని పలు ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ షాపులోని పలు రికార్డులను, స్టాకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తప్పనిసరి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, ఏవో రాజేష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోలులో మెళకువలు పాటించాలి

కౌడిపల్లి, మే 28: విత్తన కొనుగోలులో రైతులు మెళకువలు పాటిం చి, మేలు రకం విత్తనాలు కొనుగోలు చేసి, విధిగా రసీదు పొందాలని మండల వ్యవసాయాధికారి స్వప్నాజాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండలపరిధిలోని రాజిపేట, వెంకటాపూర్, పీర్యతండా, కంచన్‌పల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించినట్లు ఏవో స్వప్నాజాదవ్ తెలిపారు. రైతు లు ప్రభుత్వం గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ షాపుల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తన బస్తాపై తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీలను చూసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా తక్కువ ధరకు, ఎక్కువ ధరకు అమ్మితే మండల వ్యవసాయాధికారికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

చిలిపిచెడ్, మే 28: మండలంలోని పలు గ్రామాలను డీఎల్పీవో యాదయ్య మంగళవారం సందర్శించారు. అంతారం, శీ లాంపల్లి గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, నర్సరీ, డంపిం గ్ యార్డు, శ్మశాన వాటిక, క్రీడాప్రాంగణాలను ఆయన పరిశీలించారు. గ్రామాల వారీగా తనిఖీలు చేపట్టిన ఆయన వాటి వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మా ట్లాడుతూ గ్రామాల్లోని నర్సరీల్లో పెంచే మొక్కలను గ్రామ పంచాయతీ అధికారులు సంరక్షించాలన్నారు. హరితహారం మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శరత్ కుమార్ రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శిలు రవిశంకర్‌రెడ్డి, భూమేశ్ తదితరులు ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలి

పాపన్నపేట, మే 28: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను జూన్ 5లోగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం పాపన్నపేట మండలపరిధిలోని ఎల్లాపూర్, పొడ్చన్ పల్లి, అరికెల, తమ్మాయిపల్లి, లక్ష్మీనగర్ తదితర పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట మండల విద్యాధికారి నీలకంఠం, కాంప్లెక్స్ హెచ్ సురేందర్ గౌడ్, నవాజ్‌రెడ్డి తదితరులున్నారు.

భూసేకరణపై రైతులతో ఆర్డీవో సమావేశం

రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

తూప్రాన్, మే 28: మండలంలోని పలు గ్రామాల మీదుగా రీజనల్ రింగ్‌రోడ్డు వెళ్లనున్నది. ఇప్పటికే భూసేకరణపై అధికారులతో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన సర్వేలు జరిపారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుండ్రెడ్డిపల్లి, కిష్టాపూర్, దాతర్‌పల్లి గ్రామాల రైతులతో ఆర్డీవో జయచంద్రారెడ్డి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రైతులు లేవనెత్తిన పలు సందేహాలను అధికారులు నివృతి చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

చిన్నశంకరంపేట, మే 28: క్రీడలతో మానసికోల్లాసంతోపాటు శారీరకంగా ధృడంగా ఉంటామని వ్యాయామ శిక్షకుడు రవీందర్ తెలిపారు. మంగళశారం జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని శాలిపేటలో ఏర్పాటు చేసిన క్రీడా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 14 ఏండ్లలోపు బాలబాలికలకు ఖోఖోలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిక్షకుడు రవీందర్ సూచించారు.

పనులు చేసి పస్తులుంటున్నాం..

■ మాకు జీతాలివ్వండి మహాప్రభో
■ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల ఆక్రందన

రామాయంపేట, మే 28: ప్రభుత్వం ఆరు నెలలైనా జీతాలివ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని, వెంటనే జీతాలివ్వాలని పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎక్కడ చెత్త ఉన్నా అక్కడికి వెళ్లి తీసేస్తాం. అయినా ప్రభుత్వం తమపై కపటప్రేమ చూపడం పద్ధతి కాదన్నారు. ఆరు నెలలుగా తాము పనులు చేసి పస్తులుంటున్నా జీతాలు ఇవ్వడంలో ప్రభుత్వం అలసత్వం వహించడం తగదన్నారు. ఇప్పటికే బాకీలు తడిసి మోపెడవుతాన్నాయని పేర్కొన్నారు. జీతాలు ఇస్తే పిల్లలకు ఫీజులు కట్టి పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు. గతేడాది ఫీజులు కట్టలేదు. ఈ సంవత్సరమైనా ఫీజులు కట్టకుంటే తమ పిల్లలను బడిలో చేర్చుకోరని ఆవేదన వ్యక్తం చేశారు. చేతిలో పైసలు లేక పస్తులుంటున్నామని తెలిపారు. మరో 12 రోజుల్లో పాఠశాలలు ప్రారంభమవుతాయని, అప్పటిలోగా ప్రభుత్వం జీతాలిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డి.ధర్మారం గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

చిన్నశంకరంపేట, మే 28: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత నెలకొంటుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల మడూర్ గ్రామంలో పోచమ్మ అమ్మవారికి నిర్వహించిన బోనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అవలంబించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సాధన సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ గంగా నరేందర్, మాజీ ఎంపీపీ అరుణాప్రభాకర్ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రంగారావు, రాజిరెడ్డి, సిద్దిరాములు యాదవరావు, భూపాల్ మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పనుల పరిశీలన

నర్సాపూర్,మే 28: నర్సాపూర్ మున్సిపాలిటీలో నిర్మిస్తున్న శ్మశాన వాటికను మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక హంగులతో, సకల సదుపాయాలతో శ్మశాన వాటికను, మాడ్రన్ దోబీఘాట్‌ను నిర్మిస్తున్నామని వెల్లడించారు. అనంతరం రాయారావు చెరువు పరిసరాలను పరిశీలించి ప్లాస్టిక్, కాలుష్య రహిత చెరువుగా తీర్చిదిద్దుతామని, చెరువు కట్ట సుందరీకరణ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. చెరువు వద్ద మత్స్యకారులతో మాట్లాడి చేపలు పట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ చెరువులో శవమై...

శివ్వంపేట, మే 28: ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ చెరువులో శవమై కనిపించింది. పోలీసులు కథనం ప్రకారం..కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన జాలిగామ లక్ష్మి(60) మతిస్థితిమం సరిగాలేక ఈనెల 26న ఇంట్లో నుంచి వెళ్లి ఎవరికీ కనిపించలేదు. లక్ష్మి తనయుడు శ్రీనివాస్ 27న మిస్సింగ్ కేసు పెట్టాడు. దర్యాప్తులో భాగంగా లక్ష్మి మృతదేహం కొంతాన్‌పల్లి చెరువులో లభించిదని, ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

చిన్నశంకరంపేట,మే 28: మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉచిత పుస్తకాలు మంగళవారం చిన్నశంకరంపేటలోని విద్యావసరం కేంద్రానికి చేరాయి. 55 పాఠశాలలకు 19,700 పుస్తకాలు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ చూపాలి

చిలిపిచెడ్, మే 28: మహిళలు, బాలికలు వ్యక్తిగత ఆరోగ్యం పై, రుతుక్రమ సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ ప్రతిమ సూచించారు. మంగళవారం చిలిపిచెడ్ పల్లె దవాఖానలో అంతర్జాతీయ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని పుర స్కరించుకొని అంగన్‌వాడీ బాలికలకు, మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో బాలికల్లో అపోహలు, మూఢ నమ్మకాలను తొలిగించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

చిలిపిచెడ్ పల్లె దవాఖానలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ ప్రతిమ

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

నిజాంపేట, మే 28: అప్పులబాధతో యువ రైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నగరం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్మాట రాజు(25) వ్యవసాయ పెట్టుబడి కోసం తెలిసిన వారి దగ్గర రూ.2 లక్షలు అప్పుగా తీసుకొచ్చి వ్యవసాయం చేశాడు. ఈ ఏడాది సరిగ్గా పంట దిగుబడి రాక అప్పులు తీర్చే మార్గం కనబడక రాజు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం జేసీబీపైకి పనికిపోతానని ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాక పోవడంతో కుటుంబసభ్యులు రాజు ఆచూకీ కోసం వెతుకగా...వ్యవసాయ పొలం వద్ద మోతుక చెట్టుకు రుమాలుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి మూడేండ్ల కూతురు ప్రత్యూష, రెండేండ్ల కుమారుడు మనోజ్ ఉన్నారు.

చేపల వేటకెళ్లి వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, మే 28: చేపల వేటకెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలపరిధిలోని మిర్జాపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై నారాయణ కథనం ప్రకారం...గ్రామానికి చెందని పోతురాజు సుభాశ్(45) సోమవారం రాత్రి స్థానికంగా ఉన్న పిన్ చెరువులో చేపలు పట్టడానికి వల తీసుకొని వెళ్లాడు. ఉదయం అయిన ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా సుభాశ్ లుంగి చెరువు గట్టుపై కనిపించింది. గ్రామస్తుల సాయంతో చెరువులో గాలించగా సుభాశ్ మృతదేహం లభ్యమైంది. చేపల వలలో చిక్కుకొని మృతి చెందాడని, మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చిన్నశంకరంపేట, మే 28: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలపరిధిలోని సూరారంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై నారాయణ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన సురేశ్(30) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసై కూలీ పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆదివారం ఉదయం పంట పొలానికి వినియోగించే గడ్డి మందును తాగగా కుటుంబ సభ్యులు గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ పరిస్థితి విషమించి సురేశ్ మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మే 28: జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి పద్మవిభూషణ్, పద్మభూషన్, పద్మశ్రీ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కళలు, సామాజిక కార్యక్రమాలు, పబ్లిక్ అఫైర్స్, సైన్స్, టెక్నాలజీ, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, లిటరేచర్, విద్య, క్రీడలు, సివిల్ సర్వీసెస్ రంగాల్లో సేవలు అందించిన వారు అన్‌లైన్ పోర్టల్‌లో http://padmaaw